
విజయగార్డెన్ కాలనీలో చేరిన వర్షం నీరు


బీఎన్‌రెడ్డినగర్‌లో చెట్ల కొమ్మలను తొలగిస్తున్న కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి

గాలివానతో అగచాట్లు

ఎల్బీనగర్ పరిధిలో కూలిన చెట్లు, విరిగి పడ్డ చెట్లకొమ్మలు

- రాకపోకలకు ప్రజల అవస్థలు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం




బీఎన్‌రెడ్డినగర్‌లో...


నాగోలు శ్రీసాయి నారాయణ కాలనీలో ...

ఎల్‌బీనగర్/నాగోలు/వనస్థలిపురం: భారీ ఈదురు గాలులతో కూడిన వర్షం ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలో బీభత్సం సృష్టించింది. ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా తీవ్రమైన గాలి, వాన వచ్చింది. గాలి ఉధృతికి నాగోలు డివిజన్‌లోని జైపురికాలనీ, కొత్తపేట, మన్సూరాబాద్, బీఎస్ రెడ్డినగర్ డివిజన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో చెట్లకొమ్మలు విరిగి పడ్డాయి. వనస్థలిపురం, సచివాలయ నగర్ ప్రాంతాల్లో చెట్లు కూలిపడ్డాయి. కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. చెట్లు, కొమ్మలు, స్తంభాలు రోడ్లపై పడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

- గాలి వానకు వనస్థలిపురం గణేష్ టెంపుల్ ప్రహరీని ఆనుకుని ఉన్న భారీ రావి చెట్టు కూలి ప్రహరీతో పాటు పక్కనే పార్కింగ్ చేసిన ఉన్న ఒక ఇండికా కారు, ఆటోపై పడింది. గోడ శకలాలతో పాటు చెట్టు పడటంతో కారు పూర్తిగా ధ్వంసం కాగా, ఆటో పాక్షికంగా ధ్వంసమైంది. వానతో గాలి వీస్తుండటంతో చెట్టు కూలిన సమయంలో అక్కడ ఎవ్వరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పినట్టైంది.
- సచివాలయనగర్ నుంచి 8వి రోడ్డుకు వెళ్లే దారిలో, సచివాలయనగర్ ఈ సేవా కేంద్రం వద్ద రెండు చెట్లు కూలిపోయాయి. ప్రధాన రోడ్లపై చెట్లు కూలి పడటంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. జీహెచ్‌ఎంసీ, పోలీసు సిబ్బంది కూలిన చెట్లను రోడ్లపై నుంచి తొలగించే పనులు చేపట్టారు.
- బీఎస్‌రెడ్డినగర్ డివిజన్‌లో పలు కాలనీల్లో పెద్ద పెద్ద చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కాలనీల్లో పర్యటించి సహాయక చర్యలు చేపట్టారు.
- సాహెబ్‌నగర్ గ్రామంలో జరుగుతున్న జాతర కోసం ఏర్పాటు చేసి భారీ లైటింగ్ హోర్డింగ్స్‌తో పాటు విద్యుత్ స్తంభాలు ఈదురు గాలికి నేలకూలాయి, చెట్లకొమ్మలు విరిగి పడ్డాయి. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి డీఆర్‌ఎఫ్, విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చి.. విరిగిన స్తంభాలను, చెట్ల కొమ్మలను, లైటింగ్ హోర్డింగ్స్‌ను తొలగింపజేసి జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా చేశారు. జీహెచ్‌ఎంసీ అధికారులు వివిధ కాలనీల్లో పర్యటించి, రోడ్లపై పడి ఉన్న చెట్ల కొమ్మలను సిబ్బందితో తొలగింపజేశారు.

సీసీ కెమెరాలకు నిధులు ఇస్తా..

– ఎమ్మెల్సీ మహమూద్ అలీ


మహమూద్ అలీకి వినతి పత్రం ఇస్తున్న కాలనీవాసులు

చాదర్‌ఘాట్: ఎమ్మెల్సీ నిధుల నుంచి సీసీ కెమెరాల ఏర్పాటు కోసం నిధులను ఇస్తానని మాజీ హోంమంత్రి, ఎమ్మెల్సీ మహమూద్ అలీ హామీ ఇచ్చారు. బీఎస్‌రెడ్డి డివిజన్ గాయత్రీనగర్ ఫేజ్–2 వాసులు కాలనీ ప్రెసిడెంట్ రమేష్ ఆధ్వర్యంలో ఆదివారం అజంపురాలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీని కలిశారు. కాలనీలో సీసీ కెమెరాల ఏర్పాటుకు నిధులు ఇవ్వాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఎన్నికల కోడ్ ముగిశాక కెమెరాలకు నిధులు మంజూరు చేస్తానని ముహమూద్ అలీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ సెక్రటరీ చిన్నారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వెంకటేశం సభ్యులు సాయిరెడ్డి, శ్రీరాములు, శాంతి, శేఖర్‌రెడ్డి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి


సహభావన టౌన్‌షిప్‌లో సెల్లార్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ చింతల అరుణ

నాగోలు: డివిజన్ పరిధిలోని సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్ యాదవ్ అన్నారు. ఆదివారం బండ్లగూడలోని సహభావన టౌన్‌షిప్ ఏ–5 బ్లాక్‌లోని సెల్లార్‌ను కార్పొరేటర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, డివిజన్‌లోని అన్ని కాలనీల ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తున్నానని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సిద్దాల ఐలయ్య, మనోజ్‌కుమార్, విశ్వేశ్వర్‌రావు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా కాలనీ అభివృద్ధి


గాంధీనగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని బీఎస్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని గాంధీనగర్‌లో కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ, ప్రణాళికాబద్ధంగా కాలనీని అభివృద్ధి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు మల్లారెడ్డి, ఉపాధ్యక్షుడు నరసింహా రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆరిఫ్, కోశాధికారి లక్ష్మీనారాయణ, సలహాదారులు ప్రభాకర్‌రావు, రాంచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులతో అప్పటి ఉపాధ్యాయులు

అ ‘పూర్వ’ సమ్మేళనం

చంపాపేట: డివిజన్ పరిధిలోని కర్మన్‌ఘాట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2001 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం కర్మన్‌ఘాట్‌లోని పూజా బంకెట్ హాల్‌లో జరిగింది. ఈ సమావేశానికి 110 మంది పూర్వవిద్యార్థులు హాజరయ్యారు. ఇరవై ఐదేళ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులు కొద్దిపాటి ఉద్వేగానికి లోనయ్యారు.ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. ఒకరి యోగక్షేమాలు మరొకరు తెలుసుకున్నారు. చదువుకుంటున్న రోజుల్లో పాఠశాలలో చేసిన అల్లరి, చిలిపి పనులను గుర్తు చేసుకొని నవ్వుకున్నారు. రోజంతా ఆడుతూ పాడుతూ గడిపారు. కాగా, కార్యక్రమం ప్రారంభానికి ముందు తమకు విద్యా బుద్ధులు నేరిపిన గురువులకు పాదాభివందనం చేసి ఘనంగా సన్మానించి వారి ఆశీస్సులు తీసుకున్నారు. కుటుంబ సభ్యులతో హాజరైన పూర్వ విద్యార్థులు తమ ప్రస్తుత వివరాలను వేదికపై పంచుకున్నారు. విద్యార్థుల ఉన్నత స్థితిని చూసి ఉపాధ్యాయులు మురిసి పోయారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రవిశంకర్, దేవేందర్ యాదవ్(టిల్లు), భాస్కర్, రాజుచారి, నాగరాజు, శ్రీనివాస్, నాటి ఉపాధ్యాయులు ప్రసన్నకుమారి, లెక్కల కృష్ణారెడ్డి, బుచ్చిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాలవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానం


పురస్కారాలు అందజేస్తున్న శ్రీనివాస్ గుప్తా

వనస్థలిపురం: చదువులు, క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులను ప్రోత్సహించడానికి ప్రతిభా పురస్కారాలు అందించడం అభినందనీయమని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో–కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. వనస్థలిపురంలోని వాసవి కన్యకా పరమేశ్వరి కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం రాత్రి ఆల్ ఈజ్ వెల్ ఫౌండేషన్, ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సంస్థల ఆధ్వర్యంలో 10వ తరగతి, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు, డ్యాన్స్, మ్యూజిక్, ఆర్ట్స్, కరాటే, కిక్ బాక్సింగ్, చెస్, యోగా, స్పోర్ట్స్‌ల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్ గుప్తా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న సైకాలజిస్ట్ ఎస్.నందకిశోర్ తదితరులను అభినందించారు. సుబ్బారెడ్డి, శ్రీనివాస్, శ్రీధర్, శ్యాం, సతీష్, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కమిటీ ఏర్పాటుతో ‘దర్పల్లి’కి సంబంధం లేదు

– శివరామ ఆలయ చైర్మన్ రాజశేఖర్ రెడ్డి

లింగోజిగూడ: డివిజన్ పరిధిలోని జానకీ ఎన్‌క్లేవ్ కాలనీ శివరామ ఆలయ సర్వసభ్య సమావేశంలో ఆలయ తాళాలు పగులకొట్టారని తప్పుగా చెప్పడం జరిగిందని ఆలయ చైర్మన్ మద్ది రాజశేఖర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తమకు సమాచారం ఇవ్వకుండానే ఆలయ నూతన కమిటీని వేశారని, జరిగిన సంఘటనలకు స్థానిక కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి ఎలాంటి సంబంధం లేదని అన్నారు.

వేసవి శిక్షణ శిబిరం ముగింపు వేడుకలు

హుడాకాంప్లెక్స్: వేసవి సెలవులను చిన్నారులు సద్వినియోగం చేసుకోవడం అభినందనీయమని హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరం ముగింపు వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడాకారులను అభినందించారు. అనంతరం ఆయా పోటీల్లో ప్రతిభ కనబరిచిన చిన్నారులకు మెడల్స్ అందజేశారు. స్కేటింగ్, స్విమ్మింగ్, అథ్లెటిక్స్ కోచ్‌లు యాదయ్య, సైదులు, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

ఇబ్రహీంపట్నం రూరల్: క్రీడల్లో గెలుపోటములు సహజమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తులేకలాన్‌లో టీపీఎల్, ఆదిబట్ల మున్సిపాలిటీలోని మంగళ్‌పల్లిలో చిలుక రాములు నిర్వహించిన మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రీమియర్‌లీగ్‌లను ఫైనల్ మ్యాచ్‌కు ఎమ్మెల్యే రంగారెడ్డి హాజరయ్యారు. తులేకలాన్‌లో టాస్ వేసి మ్యాచ్ ప్రారంభించారు. మంగల్‌పల్లిలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో పోటీ ఉండడం సహజమన్నారు. గెలిచారని పొంగిపోవడం, ఓడారని కుంగిపోవడం చేయొద్దన్నారు. నేటి ఓటమి రేపటి గెలుపునకు నాంది అని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులకు ఇలాంటి వేదికలు ప్రతిభను వెలికితీస్తాయన్నారు. క్రీడాకారుల కోసం ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో క్రీడా స్థలం కేటాయించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, ఇబ్రహీంపట్నం జెడ్పీటీసీ మహిపాల్, గురునాథ్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, శివకుమార్, రజినికాంత్‌గౌడ్, పాండురంగారెడ్డి, హరిదాస్‌గౌడ్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం


మాట్లాడుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: కొత్తపేట డివిజన్ శ్రీ రామలింగేశ్వర కాలనీలోని శ్రీ రామ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం ఆదివారం ఆలయ ప్రాంగణంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ హాజరయ్యారు. ఆలయ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నూతన కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఆలయం చైర్మన్ కృష్ణకుమారి, వైస్ చైర్మన్ లావణ్య, ప్రధాన కార్యదర్శి ఎ.వాణి తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సుధాకర్, శ్రీనివాస్ రావు, కుమార్, అశోక్ చారి, నాయకులు మంచి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



నీటి వృథా నివారణపై నిర్లక్ష్యం!

- పైప్‌లైన్లు, వాల్వ్‌ల వద్ద లీకేజీలతో తాగునీరు రోడ్డు పాలు
- పట్టించుకోని జలమండలి అధికారులు
- మూసారంబాగ్, అక్బర్‌బాగ్ డివిజన్లలో తాగునీటి సమస్య


అక్బర్‌బాగ్‌లో..


ముంతాజ్ కాలేజీ నుంచి బీ-బ్లాక్‌కు వెళ్లే దారిలో..


సలీంనగర్ మోర్ మార్కెట్ వద్ద..

మలక్‌పేట: అసలే వేసవి కాలం.. అడుగంటిన భూగర్భ జలాలు.. చుక్క నీరు రాల్చని బోర్లు.. నీటి సమస్యతో అల్లాడుతున్న జనం.. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా తాగునీటి లీకేజీలను అరికట్టడంలో అధికారులు నిర్లక్ష్యం చేయడం విమర్శలకు దారి తీస్తోంది. నీటిని వృథా చేయకూడదని.. పొదుపుగా వాడుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు నల్లా విడిచిన రోజు నీటిని రోడ్లపైకి వదిలితే ఫైన్ వేస్తామని ఒకపక్క హెచ్చరిస్తున్న జలమండలి అధికారులు.. మరోపక్క పైప్‌లైన్ల లీకేజీలతో ప్రతి రోజూ వేల కొద్ది గ్యాలన్ల తాగునీరు రోడ్లపై వృథాగా పోతున్నా పట్టించుకోవడం లేదు. మూసారంబాగ్, అక్బర్‌బాగ్ డివిజన్లలో నీటి సమస్యతో ప్రజలు అవస్థలు పడుతుండగా, మ్యాన్‌హోళ్ల వాల్వ్‌లు, పైప్‌లైన్ల లీక్‌జీలతో తాగునీరు వరదలా రోడ్లపై పారుతోంది. వాటర్ వర్క్స్ అధికారుల దృష్టికి లీకేజీల విషయాన్ని తీసుకెళ్లినా నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ఆయా కాలనీల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు నీరు వృథా కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నీరు లీకేజీ అవుతున్న ప్రాంతాలు..

- మూసారంబాగ్ హేగ్డే ఆసుపత్రి పక్కలైన్‌లో..
- బేతనీయ బాప్టిస్టు చర్చికి వెళ్లే దారిలో..
- సలీంనగర్ మోర్ మార్కెట్ సమీపంలో.
- జ్ఞానదీప్ టవర్స్ చౌరస్తాలో..
- అక్బర్‌బాగ్ బాలిక జూనియర్ కాలేజీ చౌరస్తాలో..
- మలక్‌పేట ప్రభుత్వ క్వార్టర్స్‌లో..

లీకేజీలు అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలి



తాగునీటి సమస్యలను పరిష్కరించడంలో అధికారులు విఫలం అవుతున్నారు. ఫిర్యాదు చేస్తే సరైన స్పందన ఉండటం లేదు. డ్రైనేజీ సమస్యలతో పాటు తాగునీటి లీకేజీలు అరికట్టేందుకు సంబంధిత శాఖ ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నా. – బద్దం సురేందర్‌రెడ్డి, మూసారంబాగ్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్లకొమ్మల తొలగింపు, పలు మరమ్మతు పనుల కారణంగా అస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని కింద పేర్కొన్న ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ హన్మంత్‌రెడ్డి తెలిపారు.

- **ఉ.10 నుంచి 11.30 గంటల వరకు..**
  మటన్ మార్కెట్, రాణీబాగ్, ఇదారా ఊ మిల్లియా మజీద్, బాదాం గల్లీ, వాటర్ పంప్‌హౌస్, పద్మానగర్ పరిసర ప్రాంతాలు
- **ఉ.10 నుంచి మ.12 గంటల వరకు..**
  అల్మారీ కార్ఖానా, సంతోష్‌నగర్, ఎంఐజీహెచ్, సంతోష్‌నగర్ దో నంబర్ గల్లీ, సంతోష్‌నగర్ కాలనీ, సంతోష్‌నగర్ పీఎస్ పరిసర ప్రాంతాలు.
- **ఉ.11.30 నుంచి మ.ఒంటి గంట వరకు..**
  శంకర్‌నగర్, విద్యానగర్, ఓల్డ్ శంకర్‌నగర్, కిసాన్ దొడ్డి, సరోజినగర్ పరిసర ప్రాంతాలు.
- **మ.12.30 నుంచి 2 గంటల వరకు..**
  ఓల్డ్ ఈద్గా, దరాబ్ జంగ్ కాలనీ, చోటూ భాయ్ కాలనీ, మాదన్నపేట వాటర్‌ట్యాంక్, సాయిబాబా టెంపుల్, కేజీఎస్ బేకరీ, ఓల్డ్ పీఎస్ పరిసర ప్రాంతాలు.
- **మ.2 నుంచి 3.30 గంటల వరకు..**
  హదీ అమీన్ మసీద్, మూన్లీ స్కూల్, సీబీఐ క్వార్టర్స్, ఓల్డ్‌మలక్‌పేట వాటర్‌ట్యాంక్, జియా ఉల్ కా మజీద్, అబూబకర్ మజీద్ పరిసర ప్రాంతాలు.
- **మ.3.30 నుంచి సా.5 గంటల వరకు..**
  శ్రీకర్ హోటల్, భోజిరెడ్డి కాలేజ్, గణేశ్ టెంపుల్, వినయ్‌నగర్, పూసలబస్తీ, ఇండియన్ పెట్రోల్ పంప్, అగ్రికల్చర్ ఆఫీస్, ఒవైసీ గ్రౌండ్, అంబేడ్కర్‌నగర్, హ్యాపీహోమ్స్ పరిసర ప్రాంతాలు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9666021515 | 9912220363
9505507616 | 9912220365